## క్లుప్తంగా

### రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



**పామర్రు:** రాష్ట్ర స్థాయి మల్లకాంబ్ పోటీలకు పామర్రు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపిక అయినట్లు హైస్కూల్ హెచ్‌ఎం ఏ ఇందిరారాణి తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో విజేతలైన విద్యార్థులను బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన జిల్లా స్థాయి మల్లకాంబ్ సెలెక్షన్స్‌లో హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారన్నారు. 8వ తరగతి విద్యార్థి ఎస్.సాయిషణ్ముఖి, 7వ తరగతి విద్యార్థి డి.మహీధర్ జిల్లా స్థాయిలో ఎంపిక అయ్యారని అన్నారు. వీరు నవంబరు 7వ తేదీన భీమవరంలో జరగబోయే రాష్ట్ర స్థాయి మల్లకాంబ్ పోటీలలో పాల్గొంటారని అన్నారు. విజేతలైన విద్యార్థులను వీరికి శిక్షణ ఇచ్చిన పీడీలు మురళీ, రవికిషోర్‌లను హెచ్‌ఎం ఉపాధ్యాయులు అభినందించారు.

### విఠల్‌పాల్ సేవలు ప్రశంసనీయం



**పమిడిముక్కల:** విఠల్‌పాల్ సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా కొనియాడారు. ఎంపీడీఓగా పనిచేసి బుధవారం ఉద్యోగ విరమణ చేసిన చీలి విఠల్‌పాల్ దంపతులను ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, ఎంపీపీ కాసాని వేద సుప్రజ, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు సత్కరించారు. ఉద్యోగులు వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ దేవరపల్లి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొని విఠల్‌పాల్ దంపతులను సత్కరించారు.

### చీడ, పీడల నుంచి పంటలను కాపాడుకోవాలి



**గుడివాడరూరల్:** మండలంలోని తటివర్రు శివారు రామచంద్రాపురం, పట్టణంలోని పెద ఎరుకపాడు గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాల వద్ద 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. రైతులతో కలిసి వ్యవసాయశాఖ ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలో వచ్చే చీడ, పీడలు, సూక్ష్మధాతు లోపాలను నివారించేందుకు ఎంపీఎస్ఎస్ యాప్‌పై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. పంటల్లో వచ్చే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు యాప్‌లో పొందుపర్చారన్నారు. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని రైతులు చీడ, పీడల నుంచి పంటను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి బోలెం అనంతలక్ష్మి, వీఏఎస్ ప్రసాద్, ఏఈవో డి.అనూష, వీఏఏ ఇమ్రాన్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

### రీ సర్వేపై అవగాహన అవసరం



**కొమరవోలు(పామర్రు):** భూముల రీ సర్వే గురించి నిర్వహిస్తున్న గ్రామ సభలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ దిరిశం రత్నకుమారి అన్నారు. మండలంలోని కొమరవోలు గ్రామంలో రెవెన్యూ ఆధ్వర్యంలో రీ సర్వే గ్రామ సభను బుధవారం నిర్వహించారు. గ్రామ సభలో 16 దరఖాస్తులు వచ్చాయని వీటిని సత్వరమే పరిష్కరించే దిశగా తగు చర్యలు చేపట్టడతారన్నారు. ఎంపీటీసీ కారుమంచి నాగ మల్లేశ్వరరావు, పామర్రు తహసీల్దార్ జీ రవికాంత్, డీటీ గంగాధరరావు, ఆర్ఐ రాము, సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

### 400 మందికి నేత్ర వైద్య పరీక్షలు



**గుడ్లవల్లేరు:** లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో కౌతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. గుడివాడ లయన్స్ కంటి ఆసుపత్రి వారు 400 మందికి ఈ పరీక్షల్ని చేశారు. 42 మందికి దృష్టి లోపం ఉన్నట్లు నిర్ధారణ చేసి కళ్లజోళ్లకు సిఫారసు చేశారని లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు. లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వై.పి.సి.ప్రసాద్, క్లబ్ కార్యదర్శి ఎం.పెరుమాళ్లు, కోశాధికారి కల్యాణపు నవాబు, లయన్స్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఆఖరి మజిలీలోనూ అవస్థలే

- ఆనందరావుపేటలో శ్మశాన వాటికకు దారిలేక ఇక్కట్లు
- మణుగునూరులంకలో శ్మశాన వాటిక లేక కొల్లేరు భూముల్లోనే సమాధి
- వర్షాలు, వరదల సమయంలో మునుగుతున్న సమాధులు
- మనస్థాపం చెందుతున్న కుటుంబ సభ్యులు



ఆనందరావుపేటలో శ్మశానానికి చేల మధ్య నుంచి మృతదేహాన్ని తీసుకెళుతున్న దృశ్యం (ఫైల్)

**కైకలూరు:** ఆఖరి మజిలీలోనూ అవస్థలు తప్పడం లేదు. ఎవరైనా కాలం చేస్తే వారి పార్థీవదేహాన్ని తీసుకెళ్లేందుకు సరైన రోడ్డు లేక, అంత్యక్రియలు నిర్వహించేందుకు శ్మశాన వాటిక లేక అవస్థలు పడక తప్పని పరిస్థితి ఇది. ఈ సమస్యను పట్టించుకునేవారు కరువవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కైకలూరు మండలం ఆచవరం శివారు ఆనందరావుపేటలో మొత్తం జనాభా 300 మంది. 150 కుటుంబాలు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాయి. ఇక్కడ ఎవరైనా మరణిస్తే దాదాపు కిలో మీటరు దూరంలోని శ్మశాన వాటికకు తీసుకువెళ్లడానికి పచ్చని చేల మధ్యలోంచి పడుతూ, లేస్తూ వెళ్లాల్సి వస్తోంది. వరి పంట చేల మధ్య నుంచి 60 సెంట్ల భూమిని కాలినడకకు ఇస్తే సమస్య తీరుతుంది. రైతులు దారి ఇవ్వడానికి ససేమీరా అంటున్నారు. దీంతో ప్రతిసారీ మృతదేహాలను చేల మధ్యలోంచి ఇబ్బందులు పడుతూ తీసుకెళుతున్నారు.



మృతదేహాన్ని తరలించేందుకు ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు (ఫైల్)

### కొల్లేరులో మునుగుతున్న సమాధులు..

మండవల్లి మండలం మణుగునూరులంకలో అందరూ దళితులే నివసిస్తున్నారు. మొత్తం 280 కుటుంబాలకు సంబంధించి 800 మంది ఉన్నారు. వీరికి పూర్వం పెనుమాకలంక సమీపంలో 5.4 ఎకరాల విస్తీర్ణంలో శ్మశాన వాటిక ఉంది. గ్రామం కొల్లేరు వరదలకు గురవడంతో రోడ్డు పక్కనే ఇందిరమ్మ కాలనీ ఏర్పడి పలు కుటుంబాలు వచ్చాయి. గ్రామస్తులు మరణిస్తే సమీపంలోని కొల్లేరు భూముల్లో సమాధి చేయాల్సి వస్తోంది. వర్షాలు, వరదల కారణంగా ఏడాదిలో ఆరు నెలలు నీటిలోనే సమాధులు మునిగి ఉంటున్నాయి. పైగా కొల్లేరు అభయారణ్యంలో సమాధుల ఏర్పాటుపై అటవీశాఖ అధికారులు అభ్యంతరం చెబుతున్నారు. వర్షకాలంలో ఎవరైనా మరణిస్తే మృతదేహాలను బురదలో శవపేటికలో తీసుకెళ్లడం కష్టతరమవుతోందంటున్నారు.



కొల్లేరు భూముల్లో మండవల్లి మండలం మణుగునూరులంక వాసుల సమాధులు

### అనేక గ్రామాల్లో దారి సమస్యలు..

నియోజకవర్గంలో అనేక గ్రామాల్లో శ్మశాన వాటిక సమస్యలు పరిష్కారం కావడం లేదు. పూర్వం జనాభా తక్కువగా ఉండటంతో సమస్యలు రాలేదు. చేపల చెరువులు, వరి సాగు పొలాలు పెరగడంతో శ్మశాన వాటికలకు వెళ్లే రహదారులు కుచించుకుపోయాయి. మండవల్లి మండలం పెరికెగూడెం శివారు కొత్తూరు, ప్రత్తిపాడు, పులపర్రు, నుచ్చిమిల్లి, కలిదిండి మండలం ఆరుతెగళపాడు, ముదినేపల్లి మండలం నరసన్నపాలెంలో శ్మశాన వాటికకు దారి సమస్యలు ఉన్నాయి. పులపర్రు, నుచ్చిమిల్లి గ్రామాల్లో పడవలపై మృతదేహాలను శ్మశాన వాటికకు తరలించిన సందర్భాలు ఉన్నాయి.

### కన్నీరే మిగులుతోంది



గ్రామంలో ఏవరైనా మరణిస్తే వారి పార్థీవదేహాన్ని శ్మశాన వాటికకు ఎలా చేర్చాలో అనేబాధ వేధిస్తోంది. సమీప రైతులు నడక దారి కల్పిస్తే కేవలం మృతదేహాలను తరలించడానికి మాత్రమే ఉపయోగిస్తాం. అవసరమైతే గేట్లు ఏర్పాటు చేసుకుని తాళాలు పొలాల రైతుల వద్ద ఉంచి అవసరమైనప్పుడు నడకకు అవకాశం కల్పించాలని కోరుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు మా గ్రామ ప్రధాన సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం.

– దండే సైమన్‌రాజు, ఆనందరావుపేట, కైకలూరు మండలం

### అధికారులు అవకాశం కల్పించాలి



మా గ్రామానికి శ్మశాన వాటిక స్థలం లేదు. దీంతో సమీపంలోని కొల్లేరు భూమిలో మృతదేహాలను సమాధి చేస్తున్నాం. రోడ్డు సమీపంలో కొంత భాగాన్ని వాడుకుంటున్నాం. వర్షాలు, వరదలు వచ్చినప్పుడు సమాధులు మునిగిపోతున్నాయి. అటవీశాఖ అధికారులు కొంత భూమిని శ్మశాన వాటికకు కేటాయించాలి. అధికారులు మా సమస్యపై దృష్టి సారించాలి.

– జంగం సుగుణరావు, మణుగునూరులంక, మండవల్లి మండలం

### స్పందిస్తే మేలు..

అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి శ్మశాన వాటిక సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

### దీపావళి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి

#### జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక



**గుడ్లవల్లేరు:** ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రజలందరికీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపే విధంగా ఆనందోత్సాహాలతో ఈ పండుగను తమ తమ కుటుంబాలతో జరుపుకోవాలని కోరారు. ప్రజలంతా సుఖ శాంతులు, సిరి సంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు. ప్రజలు తమ తమ జీవితాల్లో ధన, ధాన్య రాశులను నింపుకుని సుభిక్షంగా ఉండాలని కోరారు.

### జాతీయ సమైక్యతకు పటేల్ కృషి

**కైకలూరు:** దేశ సమైక్యతకు మాజీ ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్‌పటేల్ ఎంతగానో కృషి చేశారని వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీలత అన్నారు. కళాశాలలో పటేల్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ జాతిని సమైక్యం చేయడంలో స్వదేశీ సంస్థానాలను విలీనం చేయడంలో పటేల్ ఎంతగానో కృషి చేశారన్నారు. వాణిజ్య విభాగం హెడ్ ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉక్కు మనిషిగా పేరొందిన పటేల్ సేవలను జాతి ఎల్లప్పుడూ గుర్తించుకుంటుందన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు అధ్యాపకులు ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.విజయకుమార్, అధ్యాపకులు పి.రవికుమార్, ఉమాశంకర్, శివనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### శ్మశానవాటికలో జంగిల్ క్లియరెన్స్



**మండవల్లి:** మండలంలోని కానుకొల్లు గ్రామంలో సర్పంచ్ నాగదాసి థామస్ ఆధ్వర్యంలో, ఎస్సీ శ్మశాన వాటికలో బుధవారం జంగిల్ క్లియరెన్స్ పనులు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ థామస్ మాట్లాడుతూ పెరిగిన కంప చెట్లను తొలగించి శ్మశానవాటికను బాగు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యదర్శి ఎం.కొండలు పనులను పర్యవేక్షించారు.

## పామర్రులో భారీ వర్షం



పామర్రులో కురుస్తున్న వర్షం

**పామర్రు:** వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పామర్రులో బుధవారం భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. దీంతో స్థానిక గఫార్ సెంటర్, అరండల్‌పేట, బాపూజీ పేట, కోటిరెడ్డి పేట, పామర్రు బస్టాండ్, తహసీల్దార్ కార్యాలయం తదితర ప్రాంతాలు వర్షపు నీటితో నిండిపోయి జలమయంగా మారాయి. గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేని కారణంగా వర్షపు నీరు రోడ్లపైకి చేరుతున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి డ్రెయినేజీలను క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు.

**అకాల వర్షం..**

**మొవ్వ:** వాతావరణం బుధవారం మధ్యాహ్నం నుంచి ఒక్క సారిగా మార్పు చోటుచేసుకుని పెద్ద ఎత్తున వర్షం కురిసింది. దీంతో బాణసంచా క్రయ విక్రయాలు ఒకింత మందగించాయి. దీంతో లక్షల్లో పెట్టుబడులు పెట్టిన లైసెన్స్ దారుల గుండెల్లో రైళ్ల పరిగెత్తాయి. మండలంలో కూచిపూడి, నిడుమోలులలో నాలుగేసి, మొవ్వ, కోసూరు, కాజలలోఒక్కొక్క షాపుకి అనుమతిని ఇచ్చారు. ఇదిలా ఉండగా అధికారులు బృందం షాపుల ఏర్పాటులను, నిర్వాహనలను పరిశీలించారు. ఇందులో భాగంగా కూచిపూడిలోని పాత సినిమా హాలు రోడ్డులో ఏర్పాటు చేసిన షాపులను పామర్రు సీఐ శుభాకర్, కూచిపూడి ఎస్ఐ ఎం.సుబ్రమణ్యం పరిశీలించారు.

## 'మానవులందరికీ భగవద్గీత' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న శ్రీధర్ తదితరులు

**గుడివాడ టౌన్:** టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం 'మానవులందరికీ భగవద్గీత' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. స్థానిక వాసవీచౌక్‌లోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం విశిష్ట ధర్మాచార్యులు కావూరి శ్రీధర్ మాట్లాడుతూ శ్రీకృష్ణుని ద్వారా ఉద్భవించిన 107 శ్లోకాల భగవద్గీత ప్రాధాన్యతను నేటి విద్యార్థులకు తెలియజేయాలనే సదుద్దేశంతో ఈ పుస్తకాలు ముద్రించామన్నారు. తిరుపతి దేవస్థానం ద్వారా గుడివాడ పట్టణానికి మూడు వేల పుస్తకాలు వచ్చాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ పుస్తకాలను తమ విద్యార్థులకు అందజేయాలని శ్రీధర్ కోరారు. కార్యక్రమంలో ఆలయ ఉపాధ్యక్షుడు శేగు వెంకటేశ్వరరావు, అర్చకులు వేదాంతం విజయసారథి ఆచార్యులు, భక్తులు భవాని, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## దళితుల భూ సమస్యను పరిష్కరించాలి



సర్వేయర్ రాజశేఖరరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

**మండవల్లి:** దళితుల ఫీల్డ్ లేబర్ సొసైటీ భూ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో బాధితులు అధికారులకు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. మండలంలోని సింగనపూడిలో నిర్వహించిన రీ–సర్వే గ్రామసభలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల్లో ఫీల్డ్ లేబర్ కో–ఆపరేటివ్ సొసైటీ పేరుతోనే భూమి ఉన్నా కైకలూరుకు చెందిన పెత్తందారుడు మాడపాటి కృష్ణప్రసాద్ దళితులపై దౌర్జన్యం చేయడం తగదన్నారు. జాయింట్ కలెక్టర్ కోర్టులో కేసు పెండింగ్ ఉందని వెంటనే తుది తీర్పు ఇచ్చి దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మండల సర్వేయర్ ఎస్.రాజశేఖరెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. సొసైటీ అధ్యక్షుడు కర్రా జగదీష, పక్కిరి దావీదు, పాముల యెహోషువ, మురాల ఆదాము, పి.జేమ్స్, ఇంటి సురేష్, బొడ్డు చింతయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాణసంచా దుకాణాల తనిఖీ



బాణసంచా దుకాణాలు తనిఖీ చేస్తున్న డీఎస్పీ శ్రావణకుమార్

**కైకలూరు:** స్థానిక మార్కెట్‌యార్డ్‌లో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను ఏలూరు డీఎస్పీ డి.శ్రావణకుమార్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు నిబంధనలకు అనుగుణంగా విక్రయాలు చేపడుతూ ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా చూడాలన్నారు. దుకాణాలకు సమీపంలో అగ్నిమాపక నిరోధక సామగ్రి, ఇసుక, నీటి లభ్యత ఉండేలా చూడాలన్నారు. వినియోగదారుల రద్దీకి అనుగుణంగా వ్యాపారులు తగిన ఏర్పాట్లు చేసుకుని ప్రశాంతంగా వ్యాపారలు నిర్వహించుకోవాలని సూచించారు.

**పామర్రు:** దీపావళి టపాసులను అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రవికాంత్ హెచ్చరించారు. స్థానిక చల్లపల్లి రోడ్డులోని కోటి జగపతి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన దీపావళి టపాసుల దుకాణాలను బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా అమ్మకాలు జరపాలన్నారు. ముందు జాగ్రత్త చర్యలను పాటిస్తూ తగు విధంగా అమ్మకాలు చేయాలని అన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పామర్రు సీఐ సుభాకర్, ఎఫ్‌వో రాంబాబు, ఆర్ఐ రాము, రెవెన్యూ, ఫైర్ శాఖల సిబ్బంది, దుకాణ యజమానులు పాల్గొన్నారు.

### అంబేడ్కర్ ఆశయాలు కొనసాగించాలి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పుష్పరాజ్

**కైకలూరు:** రాష్ట్రంలో అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని మాలమహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. కలిదిండిలో బుధవారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినా దళితవాడలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందగా ఉన్నాయన్నారు. ఇకనైనా ఈ ప్రభుత్వం దళితవాడలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు నేతల సాల్మన్‌రాజు, నాయకులు చిల్లే రాజ్‌కుమార్, ఎం.నానిబాబు, సఖబాబు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### నాగులచవితి ఏర్పాట్లపై సమీక్ష

**ముదినేపల్లి రూరల్:** ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం– చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నవంబరు 5న నాగులచవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి కోరారు. చవితి పండుగ ఏర్పాట్లకు సంబంధించి స్థానిక గ్రామ ప్రముఖులతో సమన్వయ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆలయం సింగరాయపాలెం, చేవూరుపాలెం గ్రామాల మధ్యన ఉన్నందున ఇరు గ్రామాల ప్రజలు చవితికి విచ్చేసే భక్తుల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసి చవితి పండుగను ఘనంగా నిర్వహించేందుకు కృషి చేయాలని కోరారు.

### సమస్యలపై ఆర్టీసీ చైర్మన్‌కు వినతి

**పామర్రు:** కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావును పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా బుధవారం కలిసి నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. పామర్రు ఆర్టీసీ బస్టాండ్ పనులు సగంలోనే నిలిచి పోవడంతో స్థానికులు, ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయమై సత్వరమే స్పందించి పనులను పునః ప్రారంభించి అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కోరారు. అంతర్గత రహదార్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. తోట్లవల్లూరు మండలంలోని పాములలంక బ్రిడ్జి నిర్మాణానికి తగు విధమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.ప్రవీణ్‌చంద్ర, వీ గణేష్, ఫణి, మండపాక శంకరబాబు, దాలిపర్తి ప్రసాద్, వీరంకి వెంకటేశ్వరరావు, జన్ను శోభనబాబు, వెంకటేశ్వరరావు తదితరులు అర్జీ ఇచ్చిన వారిలో ఉన్నారు.

### కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



**గుడివాడ టౌన్:** ఎస్‌జీఎఫ్ కరాటే చాంపియన్ షిప్– 2024 అర్హత పోటీలకు తమ విద్యార్థులు ఎంపికయ్యారని గౌతమ్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. బుధవారం అర్హత సాధించిన విద్యార్థులను హైస్కూల్‌లో అభినందించారు. ఈ సందర్భంగా లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 24న విజయవాడలో జరిగిన 68వ చాంపియన్‌షిప్ అర్హత పోటీల్లో తమ విద్యార్థులు అండర్– 14 కాటా విభాగంలో జి.జస్వంత్, అండర్– 17 కాటా విభాగంలో టి.హేమంత్ ప్రథమస్థానం, ఆర్.త్రిదార్థ, పి.కేశవ కౌషిక్ వర్మలు ద్వితీయ స్థానం సాధించి పోటీలకు అర్హత పొందారన్నారు. ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులను, కోచ్ ఎస్.వెంకటేశ్వరరావును ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి అభినందించారు.

### ఉద్యోగ విరమణ సత్కారం



**గుడ్లవల్లేరు:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సబార్డినేట్‌గా సేవలు అందించి అందరి మన్ననలను పొందిన పాగోలు గంగాధరరావు సేవలు మరువలేనివని తహసీల్దార్ బి.లోకరాజు అన్నారు. ఉద్యోగ విరమణను పురస్కరించుకుని బుధవారం గుడ్లవల్లేరు పాల శీతల కేంద్ర కల్యాణ మండపంలో గంగాధరరావు దంపతుల్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీటీ బి.కనకదుర్గ, ఆర్ఐలు షకీలాబేగం, పి.శివకుమార్, వీఆర్వోలు శాయన ప్రకాష్, లక్ష్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## ముందుగా డబ్బు చెల్లిస్తే ఉచితం ఎలా అవుతుంది?



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

**గుడివాడ టౌన్:** ప్రభుత్వం ప్రజలకు ఇచ్చే ఉచిత పథకాలు అంటే లబ్ధిదారుడు డబ్బు చెల్లించకుండా పథకం ఫలాలు పొందడం అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. బుధవారం సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సూపర్ 6 అమలులో భాగంగా ఉచిత వంటగ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలుచేస్తూ లబ్ధిదారుడు ముందుగా డబ్బు చెల్లించాలని అనడం ఉచితం అనిపించుకోదన్నారు. చెల్లించిన సొమ్మును 48 గంటలలో లబిదారు ఖాతాల్లో జమచేస్తామని అనడం దారుణమన్నారు. దీనిని సీపీఎం పూర్తిగా ఖండిస్తుందన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం రూ. 400 గ్యాస్ సిలెండర్ సబ్సిడీ లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తామని వెయ్యకుండా మోసం చేశారన్నారు. అనంతరం సబ్సిడీని పూర్తిగా ఎత్తేశారన్నారు. అదే విధానాన్ని కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందని ప్రజలు భయపడుతున్నారన్నారు. సొమ్ము చెల్లించకుండా లబ్ధిదారులకు మూడు గ్యాస్ సిలెండర్‌లు ఉచితంగా అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్.మురళీకృష్ణరెడ్డి, ఐద్వా కార్యదర్శి పి.రజిని పాల్గొన్నారు.

### నూరు శాతం ఉత్తీర్ణత



**కూచిపూడి(మొవ్వ):** పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలోని కూచిపూడి గ్రామంలో శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్య కళాపీఠంలో ఈ ఏడాది జూలై నెలలో జరిగిన కూచిపూడి నాట్యం సర్టిఫికెట్ కోర్సు ఫలితాల్లో తమ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. సర్టిఫికెట్ కోర్సులో హాజరైన 27 మందికి 27 మంది పాసై నూరు శాతం ఫలితాన్ని సాధించగా డిప్లమో కోర్సులో 30 మంది విద్యార్థులకు గాను 28 మంది పాసై 93 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్స్‌పాల్ వెల్లడించారు.